క్లుప్తంగా

వైభవంగా సప్తాహ మహోత్సవాలు



పాత గుంటూరు: బ్రాడీపేటలోని శ్రీ సీతారామాంజనేయ నగర సంకీర్తన సంఘం, శ్రీ సిద్ధేశ్వరి పీఠ పాలిత ఓంకార క్షేత్రం కార్యదర్శి నంబూరు వెంకట శ్రీమన్నారాయణమూర్తి ఆధ్వర్యంలో శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం నగర సంకీర్తన, నిత్యపూజల అనంతరం రుత్వికులు వేదమంత్రాల నడుమ రుక్మిణీకృష్ణుల కల్యాణం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విశేష హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ గావించారు. భక్తులు విశేషంగా పాల్గొని కల్యాణమూర్తుల్ని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం భక్తి సంగీతం, అనంతరం మంచికంటి సత్యవతి రామాయణం ప్రవచనం భక్తుల్ని ఆకట్టుకుంది.

వైభవంగా బాబా ధ్యాన మందిరం వార్షికోత్సవం



పాత గుంటూరు: కొత్తపేట శ్రీ గణేశ్వర రావు వీధిలోని శ్రీ షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరం 11వ వార్షికోత్సవాన్ని శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం బాబాకు హారతి, పంచామృతాభిషేకాలు జరిపారు. అర్చకులు చైతన్య శర్మ సారథ్యంలో సత్య సాయి వ్రతాలు భక్తిప్రపత్తుల నడుమ జరిగాయి. తీర్థ ప్రసాదాల వితరణ అనంతరం వందలాది మంది భక్తులకు అన్నదానం చేశారు. వేపూరి లక్ష్మినరసింహారావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో జనార్దనరావు రాధాదేవి దంపతులు, వై. వెంకటేశ్వరరావు, మాలతి, రాజేష్, మహేష్, వేణుగోపాల్, సుబ్బారావు, హరిబాబు, రోజా, మనీషా పాల్గొన్నారు.

బాధితులకు నాదెండ్ల మనోహర్ పరామర్శ

గుంటూరు ఈస్ట్: జీజీహెచ్ అత్యవసర విభాగంలో విరేచనాలతో బాధపడుతూ చికిత్స పొందుతున్న వారిని శనివారం జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ పరామర్శించారు. రోగులకు ధైర్యం చెప్పి, వారికి అందుతున్న వైద్య సేవల గురించి వైద్యుల్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఘటనపై కమిటీ వేయాలన్నారు. కార్పొరేషన్ వార్షిక బడ్జెట్ రూ. 1400 కోట్లు ఉన్నా, రక్షిత మంచినీరు ప్రజలకు ఇవ్వలేకపోవడం శోచనీయమన్నారు. అధికారుల బాధ్యతారాహిత్యం ఎక్కువగా కనిపిస్తోందని తెలిపారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాసయాదవ్, జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర్లు, జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ల హరి, ఇతర నాయకులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

2న ప్రత్యామ్నాయ సంస్కృతి మేళా సభ

నెహ్రూనగర్: లౌకికవాదాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాంక్షించే అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా, దళిత సంఘాలతో కలిసి మార్చి 2న వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ప్రత్యామ్నాయ సంస్కృతి మేళా సభను నిర్వహించనున్నట్లు దళిత, ప్రజా సంఘాల నాయకులు తెలియజేశారు. శనివారం విజ్ఞాన మందిరం ఆవరణలో సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య మనుగడను కాపాడేందుకు చేస్తున్న ఈ సభకు ముఖ్య అతిథిగా డాక్టర్ కత్తి పద్మారావు ముఖ్య హాజరై అంబేడ్కర్ జీవిత చరిత్ర(3వ భాగం), ఈ దేశం మనది అనే పుస్తకాలను ఆవిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు నల్లపు నీలాంబరం, పాగళ్ల ప్రకాష్, జూపూడి శ్రీనివాసరావు, నాదెండ్ల బ్రహ్మయ్య, ఉగ్గం సాంబశివరావు, చిన్నం డేవిడ్ విలియమ్స్, ఈమని చంద్రశేఖర్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసే కార్యకర్తలకు సముచిత స్థానం



సమావేశంలో మాట్లాడుతున్న నూరిఫాతిమా, పక్కన ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: పార్టీ జెండా భుజాన వేసుకుని కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం దక్కుతుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా చెప్పారు. బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా కార్యాలయంలో శనివారం రెండో డివిజన్‌కు సంబంధించి కార్పొరేటర్ మర్రి అంజలి, పార్టీ నేత సత్యనారాయణ ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య నేతలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రతి కార్యకర్తా కాలర్ ఎగురవేస్తూ ప్రజలకు ఘనంగా చెప్పే విధంగా పరిపాలన చేస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడేలా ప్రతి ఒక్క కార్యకర్త పాటు పడాలని పిలుపునిచ్చారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ రానున్న ఎన్నికలు ఎంతో కీలకమన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. అసత్యాలు, అనవసర ప్రచారాలతో టీడీపీ ప్రజలను ప్రలోభాలకు గురి చేస్తోందని, వాటిని సమర్థంగా తిప్పికొట్టి సీఎం వై.ఎస్.జగన్ సంక్షేమ పాలనను వివరించాలని తెలిపారు. తన కుమార్తె నూరిఫాతిమాను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు శంకర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, ఆంజనేయులు, శ్రీనివాసరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఎర్రబాబు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

శవ రాజకీయాలు బాబుకు వెన్నతో పెట్టిన విద్య

పట్నంబజారు: శవ రాజకీయాలు చేయడం టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుకు వెన్నతో పెట్టిన విద్య అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా విమర్శించారు. బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని ఆమె కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా అనే సామెత చందాన టీడీపీ గుంటూరు తూర్పు ఇన్‌చార్జి నసీర్ అహ్మద్ వ్యాఖ్యలు ఉన్నాయని మండిపడ్డారు. వివిధ కారణాల వల్ల ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరితే డయేరియా వల్లే అయ్యారని తప్పుడు ప్రచారం చేయడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. తూర్పు నియోజకవర్గంలో గెలిచే దమ్ములేక ఇటువంటి చౌకబారు ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. నియోజకవర్గం అభివృద్ధిపై చర్చించే సత్తా ఉందా ? అని సవాల్ విసిరారు. లేనిపోని అభాండాలు వేస్తూ రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సరికాదని హితవు పలికారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని భారీ మెజార్టీతో గెలిపించి టీడీపీ నేతలకు తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని నూరిఫాతిమా తెలిపారు.

వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఇంటింటా సర్వే



సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

గుంటూరు మెడికల్: అతిసార వ్యాధి నివారణ, నియంత్రణలో భాగంగా రౌండ్ ది క్లాక్ ప్రాతిపదికన నిరంతరం వైద్య సేవల్లో భాగంగా శనివారం ఏడు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. శారదా కాలనీలో మూడు, ఇందిరా ప్రియదర్శి కాలనీలో రెండు, లాంచెస్టర్ రోడ్డు పరిధిలో రెండు వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి ప్రజలకు వైద్య సేవలు అందించినట్లు వెల్లడించారు. ఇంటింటా సర్వేలో భాగంగా 35 వైద్య బృందాలు 12,043 గృహాలు సందర్శించి ఓఆర్ఎస్ ప్యాకెట్స్, జింక్ మాత్రలు పంపిణీ చేసినట్లు చెప్పారు. వ్యాధికి కారణాలు, లక్షణాలు, చికిత్స, నివారణపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఐదుగురు అనుమానిత అతిసార బాధితుల్ని గుర్తించి, అందులో ముగ్గురికి ఇంటి వద్దనే చికిత్స చేసినట్లు చెప్పారు. మిగిలిన ఇద్దరికీ శారదా కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డాక్టర్ టి. రమేష్, జాయింట్ డైరెక్టర్, ప్రోగ్రాం ఆఫీసర్స్ పాల్గొన్నారు.

సామాజిక సేవలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

నగరంపాలెం: స్థానిక కృష్ణబాబుకాలనీలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథక యూనిట్-3 ఆధ్వర్యంలో శనివారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఈనెల 16 నుంచి 22 వరకు పలు అంశాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వీఆర్ జ్యోత్స్నకుమారి తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి కె.సుబ్బరత్నమ్మ, జిల్లా అధికారి జీవీ సుధీర్ కుమార్, 21వ డివిజన్ కార్పొరేటర్ కె.గురవయ్య, డాక్టర్ పరిమళ, భాగ్యమ్మ విద్యార్థులు, 76వ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే ఉన్నత లక్ష్యాల సాధన

భాష్యంతో ఉత్సాహంగా 'తరంగ్ కల్చరల్ ఫెస్ట్'



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ యశస్వి

గుంటూరు ఎడ్యుకేషన్: పట్టుదల, క్రమశిక్షణ, ఏకాగ్రత ఉంటే ఎంతటి లక్ష్యాన్నైనా సునాయాసంగా సాధించవచ్చని ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. భాష్యం ఐఐటీ ఫౌండేషన్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం గోరంట్లలోని భాష్యం రామసేతు క్యాంపస్‌లో తరంగ్ ది వేవ్ పేరిట కల్చరల్ ఫెస్ట్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రమణ మాట్లాడుతూ యువతరం మంచి, చెడుల విచక్షణ గుర్తెరిగి నడుచుకుంటూ, లక్ష్యసాధన దిశగా కృషి చేయాలని చెప్పారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా క్రమశిక్షణతో మెలుగుతూ జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. విశ్రాంత అధ్యాపకుడు ఎస్.తిరుపతయ్య మాట్లాడుతూ యువతరం ఆకాశమే హద్దుగా ఎన్నో గొప్ప విజయాలను సాధిస్తున్నారన్నారనీ, వారిని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్క విద్యార్థి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని సూచించారు. ఎంచుకున్న రంగంలో ప్రావీణ్యతను సంపాదించడం వల్ల భవిష్యత్తులో ఉన్నతంగా స్థిరపడవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో భాష్యం విద్యా సంస్థల డైరెక్టర్ భాష్యం హనుమంతరావు, రామసేతు ప్రిన్సిపాల్ షఫీ, భాష్యం ఐఐటీ ప్రోగ్రామర్ ఆనంద్ కుమార్, ఆయుర్వేద వైద్యుడు కొండా వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో సత్తా చాటిన పీజీ వైద్య విద్యార్థులు



వైద్య విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి మానసిక వైద్య విభాగ పీజీ వైద్య విద్యార్థులకు జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతులు రావడం గర్వకారణమని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. పూణేలో జరిగిన జాతీయ మానసిక వైద్య విభాగ పీజీ సదస్సులో సత్తా చాటిన వైద్య విద్యార్థులు కాత్యాయని, విష్ణు నాయర్‌ను శనివారం తన చాంబర్‌లో డాక్టర్ కిరణ్‌కుమార్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాల విద్యార్థుల్లో డిజిటల్ అడిక్షన్‌పై చేసిన పరిశోధనకు ఉత్తమ పేపర్ విభాగంలో ప్రథమ బహుమతి పొందారని వెల్లడించారు. బీపీ వల్ల మెదడుకు సంబంధించిన మానసిక లక్షణాలపై ప్రజెంట్ చేసిన ఉత్తమ పోస్టర్ బహుమతి సాధించినట్లు పేర్కొన్నారు. పీజీ వైద్యులకు సలహాలు సూచనలు అందించిన మానసిక వైద్య విభాగాధిపతి డాక్టర్ నీలి ఉమా జ్యోతి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వడ్డాది వెంకట కిరణ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సాయి కిరణ్‌ను సూపరింటెండెంట్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయికృష్ణ, డాక్టర్ నిమిషా, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ రమ్య పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె

జేఏసీ రాష్ట్ర చైర్మన్ బండి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న బండి శ్రీనివాసరావు

గుంటూరు మెడికల్ : ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల్ని తక్షణమే పరిష్కరించాలని, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగుల సమ్మె నిర్వహిస్తామని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్యకార్యాచరణ సమితి (జేఏసీ) రాష్ట్ర చైర్మన్, ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గుంటూరు అరండల్‌పేట జేఏసీ ఆధ్వర్యంలో శనివారం ధర్నా జరిగింది. తొలుత పలువురు జేఏసీ నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి గుంటూరు తాలూకా కార్యాలయం నుంచి లాడ్జి సెంటర్ అంబేడ్కర్ విగ్రహం వరకు నినాదాలు చేసుకుంటూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అరండల్‌పేటలో జరిగిన ధర్నాను ఉద్దేశించి శ్రీనివాసరావు మాట్లాడారు. ప్రభుత్వం సకాలంలో జీతాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రభుదాస్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు బసవలింగారావు, వేలంగిణిరాజు, ఏపీ ఎన్జీవో నాయకులు కూరాకుల శ్రీనివాసరావు, శ్యామ్‌సుందర్, శివజ్యోతి, సూరి, చింతల కళ్యాణ్ కుమార్, విజయ్, పీటీడీ ఉద్యోగ సంఘాల నాయకులు రవీంద్రారెడ్డి, రంజిత్‌కుమార్ , తిరుమలరెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాస కేంద్రం బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ తదితరులు

ఏఎన్‌యూ: స్కోప్ ఫౌండేషన్, యునివర్సిటీ లైబ్రరీ సైన్సు విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే వ్యక్తిత్వ వికాస కేంద్రం బ్రోచర్‌ను ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎన్‌యూ దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ డాక్టర్ నాగరాజు, పరీక్షల కో-ఆర్డినేటర్ డాక్టర్ సోమశేఖర్, అధ్యాపకులు భూషణమ్, డాక్టర్ సుభారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య రాజశేఖర్ మాట్లాడుతూ స్కోప్ ఫౌండేషన్ లైబ్రరీ సైన్సు డిపార్ట్‌మెంట్‌తో కలిసి యువతను మంచి మార్గంలో నడిపించేందుకు వ్యక్తిత్వ వికాస కేంద్రం ఏర్పాటు చేయటం అభినందనీయమని తెలిపారు.డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అంటూ యూనివర్సిటీ విద్యార్థులకు పోటీ పరీక్షలు, గ్రామీణ యువతకు వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు నిర్వహించడం మంచి పరిణామమని తెలిపారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించడం తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న డీటీసీ కరీం, పక్కన ఆర్టీవో గోపాల్

పట్నంబజారు: వాహనంతో రోడ్డు పైకి వచ్చే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని డీటీసీ షేక్ కరీం చెప్పారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం స్వర్ణభారతీనగర్‌లోని ఆర్టీఏ కార్యాలయంలో మోటారు వాహనాల సవరణ చట్టం - 2019 అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీసీ కరీం మాట్లాడుతూ 2019 మోటారు వాహనాల సవరణ చట్టం ప్రకారం కఠిన నిబంధనల్ని పొందుపరిచారని తెలిపారు. కేవలం జరిమానాలే కాకుండా జైలు శిక్ష కూడా విధించే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాల్ని అరికట్టవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీఓ ఎస్.గోపాల్, ఎంవీఐలు సౌజన్య, మల్లేశ్వరి, సంధ్య పాల్గొన్నారు.

ఏఐ, డేటా సైన్స్‌తో ఉజ్వల భవిత



ప్రొఫెసర్ సూర్య కామేశ్వరిని సత్కరిస్తున్న రోహిణీదేవి, ప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ), డేటాసైన్స్‌తో ఉజ్వల భవిష్యత్తు ఉందని ఏఎన్‌యూ ప్రొఫెసర్ యు. సూర్య కామేశ్వరి తెలిపారు. లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో శనివారం అమరావతి రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్లో డిగ్రీ చివరి సంవత్సర విద్యార్థినులకు వీడ్కోలు పలుకుతూ ఫేర్‌వెల్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు నృత్యాలతో హుషారెత్తించారు. కళాశాల డైరెక్టర్ బీఎస్ఆర్కే ప్రసాద్ మాట్లాడుతూ సబ్జెక్టుపై పట్టుతో భాషా, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలతో ప్రతిభకు మెరుగులు దిద్దుకోవాలని సూచించారు. అనంతరం ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, డేటాసైన్స్ కోర్సులపై అవగాహన కల్పించారు. ఏఎన్‌యూ ప్రొఫెసర్ డాక్టర్ యు. సూర్య కామేశ్వరి డిగ్రీలో ప్రవేశపెట్టిన నూతన కోర్సులు, వాటి ప్రాముఖ్యత, ఉద్యోగావకాశాల గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.రోహిణిదేవి, అధ్యాపక, అధ్యాపకులు పాల్గొన్నారు.